

పోలీసుల వేషంలో గొలుసు చోరీ..!

● తనిఖీల పేరుతో దుండగుల హల్‌చల్

● బాధితుల లబోదిబో 8

బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

● తప్పకాల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్



బళ్లారిలో ప్రథమ బహుమతి అందుకుంటున్న రోహిణి



లిఖిత (ద్వితీయ)



రాధ (తృతీయ)



హోసూరులో ప్రథమ బహుమతి అందుకుంటున్న భార్గవి



మంజుల (ద్వితీయ)



శ్రీనిక (తృతీయ)



ముగ్గు వేస్తున్న బళ్లారి ఎస్పీ శోభారాణి



బళ్లారిలో ప్రథమ బహుమతి ముగ్గు



మాట్లాడుతున్న శ్రీనంద స్కూల్ యజమాని వి. గాంధీ



హోసూరులో ప్రథమ స్థానం సాధించిన ముగ్గు



హిమగిరి గ్రూప్ మేనేజర్ ధర్మారావుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం



ముగ్గులు వేస్తున్న మహిళలు



హోసూరులో...



రంగుల లోకం..

● బళ్లారి, హోసూరులో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన

● సంప్రదాయాలకు పట్టం కడుతున్న ఆంధ్రజ్యోతి, ఏబీఎన్: బళ్లారి ఎస్పీ శోభారాణి ప్రశంసలు

● సంస్కృతీసంప్రదాయాలను గౌరవించడం అభినందనీయం : మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

బళ్లారి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇల నుంచి నేల పైకి హరివిల్లు రాలినట్లు..రంగుల లోకం వెల్లివిరిసింది. ఆదివారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహించిన సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్)కు విశేష స్పందన లభించింది. నగరంలోని శ్రీ నంద రెసిడెన్షియల్ స్కూల్ యాజమాన్యం స్థానికంగా సహకారం అందించింది. సంప్రదాయ దుస్తులతో మహిళలు పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మహిళలకు అద్భుత అవకాశం : ఎస్పీ

ఆంధ్రజ్యోతి సంప్రదాయాలకు పట్టం కట్టడం ప్రశంసనీయమని ఎస్పీ శోభారాణి అన్నారు. ముగ్గులు పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఎస్పీగా విధులు నిర్వర్తించడం కన్నా గృహిణిగా మెలగడం కష్టమన్నారు. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలతో మహిళలకు గౌరవం పెరుగుతోందన్నారు. అనంతరం ఎస్పీకి శ్రీనంద స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

సంస్కృతీసంప్రదాయాలను గౌరవించాలి

● శ్రీనంద స్కూల్ యజమాని వి. గాంధీ

భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని నేటి తరం అందరూ గౌరవించాలని శ్రీ నంద రెసిడెన్సియల్ స్కూల్ యజమాని వేములపల్లి గాంధీ కోరారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆయన సంక్రాంతి వచ్చిందంటే పూర్వం ఇళ్ల ముందు రంగుల ముగ్గులు వేస్తూ మహిళలు కనిపించేవారన్నారు. వారి ఆచారాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ముగ్గులు పోటీలను నిర్వహించిన ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు. తెలుగు విశ్రాంత లెక్చరర్ జీఆర్ వెంకటేశులు, మాట్లాడుతూ ముగ్గుల పోటీ నిర్వహిస్తుండడం హర్షనీయమన్నారు. వీరితో పాటు అడ్వైజర్ కమిటీ కో- ఆర్డినేటర్ హెచ్, జే. హరికుమార్, వైస్ చైర్మన్ వి. మురళీకృష్ణా, కార్యదర్శి రమణకుమార్, వినయ్‌చౌదరి, ప్రిన్సిపాల్, సరిత, ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకాంత్, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ముగ్గుల పోటీల్లో తొలిబహుమతి బెంగళూరు చెందిన రోహిణి సాధించారు. ద్వితీయ బహుమతి లిఖిత గెలుచుకున్నారు. మూడో బహుమతి రాధా సాధించారు. వీరికి రూ. 6వేలు, 4 వేలు, 3 వేల చెక్కులను శ్రీనంద స్కూల్ యాజమాన్యం అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమానం అందజేశారు.

న్యాయ నిర్ణేతలకు సన్మానం

ముగ్గుల పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ముగ్గురిని పాఠశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో పలువురు ప్రముఖులతో పాటు ఆంధ్రజ్యోతి సిబ్బంది రవికుమార్, క్రష్ణారెడ్డి, బళ్లారి రూరల్ రిపోర్టర్ ప్రభాకర్, కంప్లి రిపోర్టర్ వీరేష్, తోరణగల్లు రిపోర్టర్ రాజేంద్రబాబు, బళ్లారి సిటీ రిపోర్టర్ కే. మల్లికార్జున, సిరుగుప్ప రిపోర్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



బళ్లారిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

హోసూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మన సంప్రదాయాలు ప్రకృతికి తోడైనప్పుడు మరింత అందంగా శోభాయమానంగా కనిపిస్తుందని మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పెర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్‌వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి బాలకృష్ణా రెడ్డి బహుమతులను పంపిణీ చేశారు. బాగలూరు రోడ్డు ఎలువపల్లి హిమగిరి సిటీలోని మైదానంలో ఆదివారం ముత్యాల ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. హిమగిరి సంస్థ ముఖ్యులు కార్తీక్‌రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి జ్యోతిప్రజ్వలన చేశారు. పోటీల్లో 200మందికి పైగా మహిళలు పాల్గొని అందమైన ముగ్గులను తీర్చిదిద్దారు. ప్రత్యేక మహిళల బృందం కోలాటం ఆడుతూ ముగ్గులు వేసే పోటీదారులను ప్రోత్సహించారు. రెండు గంటలపాటు జరిగిన పోటీల తర్వాత న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా శ్రీదేవి, ఎం సరస్వతి, సుగుణ, విజయలక్ష్మి, ఎస్ కారిణి, నిమాయ్ పబ్లిక్ స్కూల్ వైస్‌ప్రిన్సిపాల్ సోమసుందరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వప్నసింగ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఎన్నో ఏళ్లుగా ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. హిమగిరి సిటీ సంస్థ ప్రాంగణంలో ప్రకృతి రమణీయత మధ్య పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. వెనుకబడిన పంచాయతీగా ఉన్నప్పటికీ హిమగిరి సిటీ చైర్మన్ ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు.

ఆకర్షణగా కోలాటం...

ముగ్గుల పోటీ ఉత్సాహంగా సాగేందుకు ఏర్పాటు చేసిన వివిధ బృందాల కోలాటం ఎంతగానో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోటీల్లో ప్రథమ బహుమతి విజేతగా భార్గవి, ద్వితీయ బహుమతి విజేతగా మంజుళ, తృతీయ బహుమతి విజేతగా శ్రీనికా గెలుపొందారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలకు వరుసగా రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు నగదు బహుమతి అందజేశారు. మరో 12మందికి కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేశారు. కాగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆంధ్రజ్యోతి క్యాలెండర్, చీర పంపిణీ చేశారు. జ్యోతి బాలకృష్ణారెడ్డి బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, హిమగిరి గ్రూప్ చైర్మన్ కార్తీక్ రెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, హిమగిరి గ్రూప్ మేనేజర్ ధర్మారావులను షీల్డులతో సత్కరించారు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన అన్నాడీఎంకే కార్యకర్తలకు షీల్డులను అందజేశారు. పోటీలలో పాల్గొన్నవారికి హిమగిరి సిటీ తరపున చక్కటి విందు కల్పించారు. కార్యక్రమంలో అన్నాడీఎంకేకు చెందిన యూనియన్ పరిధిలోని కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, చన్నసంద్ర పంచాయతీ క్లర్క్ మాదేశ్, చన్నసంద్ర సర్పంచ్ జయకుమార్‌రెడ్డి, బాగలూరు వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, యూనియన్ చైర్మన్ శశి వెంకటస్వామి, వైస్‌ప్రెసిడెంట్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకానికి మారుపేరు సంగీత

● కార్పొరేట్ ఆఫీస్ ప్రారంభంలో నటుడు రమేశ్ అరవింద్

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంగీత మొబైల్స్ సంస్థ నమ్మకానికి మారుపేరని ఐదు దశాబ్దాల పాటు వ్యాపార రంగంలో విశ్వాసాన్ని చూరగొన్నారని నటుడు రమేశ్ అరవింద్ అభిప్రాయపడ్డారు. జయనగర్‌లో నూతనంగా నిర్మించిన సంగీత సంస్థ కార్పొరేట్ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. సంగీత గాడ్జెట్స్‌ను ఆరంభించారు. ఈ సందర్భంగా నటుడు రమేశ్ అరవింద్ మాట్లాడుతూ సంగీత మొబైల్స్ దక్షిణభారత్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించిందని ప్రత్యేక ఆఫర్‌లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయన్నారు. బెంగళూరు దక్షిణ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ సంగీత ఒక విజన్ కల్గిన సంస్థ అని కొనియాడారు. ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మాట్లాడుతూ సంగీతతో తమకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉందన్నారు. నందన గ్రూప్ హోటల్స్ సీఎండీ డాక్టర్ ఆర్ రవిచందర్, జయనగర్ ఎమ్మెల్యే సీకే రామమూర్తి, బెంగళూరు దక్షిణ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఎన్‌ఆర్ రమేశ్, అడయార్ ఆనందభవన్ ఎండీ కేపీ వెంకటేశలు పాల్గొన్నారు. సంగీత సంస్థ ఎండీ సుభాష్‌చంద్ర మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంగీత వెయ్యి షోరూంల లక్ష్యాన్ని చేరుకోనుందన్నారు. ప్రస్తుతం మొబైల్ గాడ్జెట్స్‌ల విస్తరణతోపాటు భౌగోళికంగాను వ్యాపారాలను విస్తారం చేయదలిచామన్నారు. దేశంలో మొబైల్స్ రిటైల్ రంగంలో సంగీత నమ్మకంతో వినియోగదారులను ఆకట్టుకుంటోందన్నారు. 1974లో గ్రామ్‌ఫోన్‌లతో ప్రారంభమైన సంగీత సంస్థ ప్రస్తుతం 800 స్టోర్‌లతో కొనసాగుతోందన్నారు. సంగీత వ్యవస్థాపకులు నారాయణరెడ్డితోపాటు డైరెక్టర్‌లు, చందుతోపాటు పలువురు పాల్గొన్నారు.



కార్పొరేట్ కార్యాలయం ప్రారంభంలో నటుడు రమేశ్ అరవింద్, ఎంపీ తేజస్విసూర్య

ఇంటికో కళాఖండం పట్టుకెళ్లండి

●కళాకారులను ప్రోత్సహిద్దాం ● 22వ 'చిత్రసంతె' ప్రారంభంలో సీఎం సిద్దరామయ్య పిలుపు

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంతలు, జాతరలు మన సంస్కృతిలో అనాదిగా వస్తున్న సంప్రదాయాలు. ఆలయాలకు అనుబంధంగా జాతరలు, అవసరమైన వస్తువుల కొనుగోళ్లకు సంతలు జరిగే విధానం దేశమంతటా ఉందని అయితే నగరంలో 'చిత్రసంతె' భిన్నమైనదని ఇటువంటిది దేశంలో ఎక్కడా ఉండదని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. చిత్రసంతెకు వచ్చినవారు ఇంటికో కళాఖండాన్ని పట్టుకెళ్లాలని పిలుపునిచ్చారు. మన కళాకారులను మనం ప్రోత్సహించుకోవాల్సిన అవసరం ఉందని ప్రోత్సహించారు. చిత్రకళాపరిషత్ ప్రాంగణంలో ఆదివారం చిత్రసంతెను సీఎం లాంఛనంగా ప్రారంభించారు. 22వ చిత్రసంతె జరుగుతోందని ముఖ్యమంత్రిగా ఏడుసార్లు తానే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర సంస్కృతి, పరంపర, సంప్రదాయాలు చిత్రాల రూపంలో రాష్ట్రం, ప్రపంచానికి తెలపాలనే చిత్రకళాపరిషత్ ఏటా చిత్ర సంతె జరుపుతోందన్నారు.

22 రాష్ట్రాల కళాకారులు.. 1400 దుకాణాలు..

చిత్రకళాపరిషత్ ఏర్పాటు చేసిన చిత్రసంతెలో 22 రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళాకారులందరూ భాగస్వామ్యులయ్యారు. చిత్రసంతెకు ఓ భిన్నమైన విధానం ఉంది. ఇక్కడికి కళాకారులు తాము రూపొందించిన కళాఖండాలను నేరుగా విక్రయించుకోవచ్చు. ఎటువంటి అద్దె, కమీషన్ వంటివి ఉండవు. పూర్తిగా ఉచితంగా ఏర్పాటు చేస్తారు. శివానంద సర్కిల్ నుంచి విండ్సర్‌మానర్ సర్కిల్ దాకా రోడ్డుకు ఇరువైపులా కళాఖండాల ప్రదర్శన అద్భుతం అనిపించింది. ఈసారి చిత్రసంతెలో మహిళలకు సమర్పించేలా రూపొందించారు. మహాత్మాగాంధీ, అంబేడ్కర్, సావిత్రిబాయిఫూలె, ఫాతిమా షేక్, కమలాబాయి ఛటోపాధ్యాయ, యశోదరమ్మ దాసప్ప, దత్తమ్మవంటివారి చిత్రాలను ప్రదర్శించారు. రాష్ట్రంలో మహిళలకోసం అమలు చేస్తున్న వివిధ గ్యారెంటీ పథకాల కళాఖండాలు ఆకర్షణీయం అనిపించాయి. మంత్రులు సుధాకర్, భైరతి సురేశ్, ఎంపీ పీసీ మోహన్, చిత్రకళాపరిషత్ చైర్మన్ బీఎల్ శంకర్ సహా పలువురు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం 7లో..

పెరిగిన బస్సు చార్జీలు ● బీఎంటీసీలో రూ.3 నుంచి 5 వరకు.. ● 4 కార్పొరేషన్లలోనూ 15శాతం పెంపు.. 7లో..





మోగిన శంఖం


కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు







సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజీ మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద

హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభాప్రాంగణం



పెరిగిన బస్సు చార్జీలు

» బీఎంటీసీలో రూ.3-5 వరకు..

» 4 కార్పొరేషన్లలోనూ 15శాతం పెంపు

బెంగళూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రివర్గ నిర్ణయానికి అనుగుణంగా బస్సు చార్జీలు పెంచేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి కొత్త చార్జీలు అమలులోకి వచ్చేశాయి. బెంగళూరు నగరంలో సంచరించే బీఎంటీసీ బస్సులలో రూ.3 నుంచి 5వరకు చార్జీ పెరిగింది. ఏసీ వజ్ర సర్వీసులో గరిష్ఠంగా రూ.40 వరకు చార్జీ పెరిగింది. నగర పరిధిలో నిత్యం 8వేలకుపైగా బస్సులు సంచరిస్తాయి. మెజస్టిక్, శాంతినగర్, మైసూరు రోడ్డు శాటిలైట్‌తోపాటు వివిధ ప్రాంతాల బస్టాండ్‌ల నుంచి నగర వ్యాప్తంగా తెల్లవారున 4 గంటల నుంచి అర్ధరాత్రి దాకా బస్సు సర్వీసులు ఉంటాయి. అయితే సింగిల్‌స్టేజ్‌కు రూ.5ఉన్న చార్జీ నుంచి సుదూరం వరకు పరిశీలిస్తే రూ.3నుంచి 5వరకు ధర పెంచినట్టయ్యింది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హెచ్‌ఏఎల్‌కు గతంలో రూ.270 ఉండగా రూ.310కు పెరిగింది. బనశంకరికి రూ.320, కాడుగూడి రూ.330, హెచ్‌ఎస్‌ఆర్ లే అవుట్‌కు రూ.300, మెజస్టిక్‌కు రూ.290దాకా పెరిగింది.

4 కార్పొరేషన్లలోనూ 15శాతం పెంపు అమలు

రాష్ట్రంలో కేఎస్‌ఆర్టీసీ, వాయువ్య కర్ణాటక, కల్యాణ కర్ణాటక, బీఎంటీసీలలోనూ 15శాతం చార్జీలు పెరిగాయి. 3 కార్పొరేషన్లలో అతి పెద్దదైన కేఎస్‌ఆర్టీసీ ద్వారా రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలు తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్, కేరళలకు బస్సు సర్వీసులు ఉన్నాయి. రాజధాని బెంగళూరు కేంద్రంగా కొనసాగుతున్న కేఎస్‌ఆర్టీసీ ప్రతిరోజూ 8837 సర్వీసులు నడుపుతోంది. వాయువ్య ఆర్టీసీ ప్రధానంగా బెళగావి, బాగల్కోటె, హుబ్బళ్ళి, గదగ్‌తోపాటు ఉత్తర కర్ణాటక జిల్లాలతోపాటు మహారాష్ట్ర, గోవాలకు ఎక్కువ సర్వీసులు కొనసాగిస్తుంది. ప్రస్తుతం 4,716 సర్వీసులు నడుపుతోంది. ఇక కల్యాణ కర్ణాటక (ఈశాన్య కర్ణాటక) కార్పొరేషన్ కలబురగి, బీదర్, బళ్ళారి, యాదగిరి, రాయచూరుతోపాటు వివిధ జిల్లాలకు 4,356 సర్వీసులు నడుపు తోంది. నాలుగు కార్పొరేషన్లు కలిపితే 24వేలకుపైగా సర్వీసులు కొనసాగిస్తున్నాయి. అయితే ఏసీ సర్వీసులకు జీఎస్టీ అదనపు భారం పడుతోంది.

మహిళలకు ఉచితం - పురుషులకు భారం

రాష్ట్రంలో నాలుగు కార్పొరేషన్లలోనూ శక్తి గ్యారెంటీ ద్వారా మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసలుబాటు ఉంది. కానీ పురుషులకు మాత్రం బస్సు చార్జీ అదనపు భారమైంది. ఇప్పటికే బస్సు చార్జీలు భారమని భావిస్తున్న తరుణంలో అదనంగా 15శాతం పెరగడంతో పురుషులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎక్కడికైనా వెళ్లాలంటే మహిళలు మాత్రమే ప్రయాణించరు. వారితోపాటు వెళ్లే కుటుంబ సభ్యులలోని పురుషులకు చార్జీలు భారం అవుతున్నాయి. మహిళలకు ఉచితంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్టీసీ కోట్లాది రూపాయల నష్టంలో ఉన్నా అదనంగా పూర్తిగా ఉచిత ప్రయాణాలు కొనసాగించడం అదనపు భారం మినహా ప్రత్యేకించి లాభాలు సాధ్యం కాదనే అభిప్రాయాలు ఉన్నాయి.

రేపోమాపో మాల్‌గా మారనున్న పీణ్యా బస్టాండ్

మధ్యకర్ణాటక ప్రాంతాలైన తుమకూరు, శివమొగ్గ, దావణగెరె, హాసన్, చిక్కమగళూరు, మంగళూరు, ఉడుపితోపాటు ఉత్తర కర్ణాటక జిల్లాలకు వచ్చే బస్సులన్నీ మెజస్టిక్ వస్తే ఒత్తిడి పెరుగుతుందని 2014లో 6.21 ఎకరాల విస్తీర్ణంలో రూ.40కోట్లతో టర్మినల్‌ను పీణ్యాలో భారీ సౌలభ్యాలతో బసవేశ్వరబస్టాండ్‌ను నిర్మించారు. ఏకంగా 135 షాప్‌లతోపాటు వందలాదిబస్సులు ఒకేసారి వచ్చివెళ్లేందుకు వీలుండేలా నిర్మాణాలు జరిపారు. ఆరంభం ఆర్భాటం అనిపించినా నాలుగైదేళ్లుగా బస్టాండ్ వెలవెలబోతోంది. నగర నడిబొడ్డున భారీ భవనాన్ని వృథాగా ఉంచకుండా అద్దెకు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కల్యాణమండపం, షాపింగ్‌మాల్, ఆసుపత్రి, విద్యాసంస్థలు, హోటల్‌కు కేటాయించేందుకు టెండర్లు పిలిచారు. అయితే వ్యాపారులు టెండరులో పాల్గొనేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఏకంగా 3-10ఏళ్లపాటు లీజుకు ఇవ్వాలని తీర్మానించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం



మూలవిరాట్టుకు విశేషఅలంకరణ

దొడ్డబళ్ళాపుర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఘాటి సుబ్రమణ్యస్వామి క్షేత్రంలో పుష్యమాసం శుక్లపక్షం షష్ఠిని పురస్కరించుకుని శుభ మీనలగ్నంలో సుబ్రమణ్యస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. రథానికి బ్రహ్మ, విష్ణు, ఈశ్వరుడిపేరిట పూజలు నిర్వహించి రథం నాలుగు చక్రాలకు రుగ్వేద, సామవేద, యజుర్వేద, అధర్వణవేద పూజలు చేశారు. వాసుకి నాగదేవతకు ప్రార్థనలు చేసిన అనంతరం కళసం పెట్టారు. అనంతరం రెండు గరుడపక్షులు వచ్చి రథం చుట్టూ మూడు ప్రదక్షిణలు వేశాయి. తదుపరి రథోత్సం తాడును భక్తుల జయజయధ్వానాల నడుమ లాగారు. జిల్లా, రాష్ట్రం నలుమూలలనుంచి భక్తులు తరలి వచ్చారు. రథంపై అరటిపండు వేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తాగునీరు, భోజన వ్యవస్థ కల్పించారు. రథోత్స వానికి ప్రత్యేకంగా 75 ఆర్టీసీ బస్సులు కల్పించారు. అవాంఛనీయసంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు కల్పించారు. ఎటు చూసినా భక్తుల సందడి నెలకొంది. రథోత్సవం సజావుగా సాగడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

బాలసుబ్రమణియమ్ (జయంతి)



కర్ణాటక సంగీత గాయకులు, జీఎన్‌బీగా చిరపరిచితులైన గుడలూరు నారాయణస్వామి బాలసుబ్రమణియమ్ 1910 జనవరి 6న తమిళనాడు రాష్ట్రం థేని జిల్లా గుడలూరు ప్రాంతంలో జన్మించారు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యంగార్, మధురై మణి అయ్యర్‌లతో కలసి ప్రదర్శనలు ఇచ్చారు. కర్ణాటక గాయనంలో 'లయ'కు ప్రాధాన్యత ఇస్తూనే 'గమకం'ను నియంత్రించే కొత్తశైలి ప్రవేశపెట్టిన ఘనత ఆయనది. 250కుపైగా కృతులు స్వరకల్పన చేశారు. చెన్నైలోని ఆలిండియా రేడియోలో కర్ణాటక సంగీత కార్యక్రమాలకు ప్రధాన నేతృత్వం వహించారు. 1965 మే 1న కన్నుమూశారు.

సీఎస్ జయరామన్ (జయంతి)



చిదంబరం సుందరం పిళ్ళై (సీఎస్) జయరామన్ 1917 జనవరి 6న తమిళనాడు రాష్ట్రం చిదంబరంలో జన్మించారు. 1940-70ల మధ్య తమిళ సినిమాలలో ప్రముఖ నటుడు, సంగీత దర్శకు డు, నేపథ్య గాయకుడిగా రాణించారు. కన్నడలోనూ కొన్ని పాటలు రచించారు. వాటిలో డాక్టర్ రాజ్ కుమార్ నటించిన 'బేడర కన్నప్ప'లోని 'శివప్ప కాయో తండే' పాట ఎంతో పేరొందింది. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి ఈయన బావమరిది. ఈ కారణంగా కరుణానిధి సినీరంగంలో స్క్రిప్ట్ రైటర్‌గా అడుగుపెట్టారు. సీఎస్ 1995 జనవరి 29న కన్నుమూశారు.

త్యాగరాజస్వామి (వర్ధంతి)



త్యాగయ్య, త్యాగబ్రహ్మ పేర్లతో ప్రసిద్ధులైన త్యాగరాజస్వామి 1767 మే 4న తమిళనాడు రాష్ట్రం తంజావూరులో జన్మించారు. నాదోపాసన ద్వారా భగవంతుడిని తెలుసుకోవచ్చునని నిరూపించిన వాగ్గేయకారుడు. కర్ణాటక సంగీతత్రయంలో మరో ఇద్దరైన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులకు సమకాలీకులు. కర్ణాటక సంగీతానికి మూలస్తంభంగా పేర్కొంటారు. ఆయన జయంతిని భారతీయ సంగీత దినోత్సవంగా ఆచరిస్తారు. తిరువయ్యారులో సంగీతనిధికి నివాళిగా త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు నిర్వహించడం పరిపాటి. 1847 జనవరి 6న నిర్యాణం చెందారు.

కపిల్‌దేవ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత కపిల్‌దేవ్ రామ్‌లాల్ నిఖంజ్ 1959 జనవరి 6న చండీఘడ్‌లో జన్మించారు. క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా దేశంలోనే కాక ప్రపంచంలోనే గుర్తింపు పొందారు. ఆయన కెప్టెన్సీలో 1983లో భారతజట్టు వరల్డ్‌కప్ సాధించింది. వన్డేలలోనూ, టెస్ట్ మ్యాచ్‌లలోనూ రికార్డులు కలిగారు. ఎన్నో విజయాలు సాధించిన ఆయన 'అర్జున' అవార్డుతోపాటు పలు పురస్కారాలు పొందారు.

రుక్మాంగదనాయుడుకు శిక్షణరత్న పురస్కారం

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): స్నేహకూట సాంస్కృతిక వేదిక, సేడంలోని దాసధేను ట్రస్టులు సంయుక్తంగా నగరంలోని శ్రీకృష్ణ విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ఎం రుక్మాంగదనాయుడుకు శిక్షణరత్న పురస్కారం ప్రదానం చేశారు. చామరాజపేటలోని కన్నడ సాహిత్యపరిషత్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హరిదాస విద్వాంసులు డాక్టర్ అరళుమల్లిగె పార్థసారథి, రచయిత డాక్టర్ సురేశ్‌పాటిల్, విజయ కళాశాల అధ్యాపకులు వాదిరాజ, ఎం శివస్వామి ముఖ్యులుగా పాల్గొన్నారు. దాసదేను ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ వాసుదేవ అగ్నిహోత్రి అధ్యక్షత వహించారు. పార్థసారథి మాట్లాడుతూ కృష్ణగ్రూప్ విద్యాసంస్థల ద్వారా దశాబ్దాలకాలంగా కన్నడ భాషా సంస్కృతితోపాటు వేలాదిమంది విద్యార్థులకు ఉత్తమమైన బోధనలు అందిస్తున్నారన్నారు. ఐదు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేశారని కొనియాడారు. వాసుదేవ అగ్నిహోత్రి మాట్లాడుతూ మాతృభాష తెలుగు అయినా కన్నడ పట్ల అభిమానం కలిగి ఉన్నారన్నారు. స్నేహకూట సాంస్కృతిక వేదిక ఏటా శిక్షణరత్న పేరిట సమాజంలో ఉత్తమంగా సేవలందించినవారికి అందిస్తోందన్నారు. శిక్షణరత్న పురస్కారం పొందిన రుక్మాంగదనాయుడుకు విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.



పురస్కారంతో సత్కారం ఇలా..

అభివృద్ధి పనులకు శ్రీకారం

విజయనగర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విజయనగర్ వార్డులో శాసనసభ్యుల ప్రదేశాభివృద్ధి నిధులకింద పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కృష్ణప్ప శ్రీకారం చుట్టారు. విజయనగర్, చోళరుపాళ్య లే అవుట్‌లలో డాంబరీకరణ పనులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధిదీపాలు ఆధునీకరించనున్నట్టు తెలిపారు. కొత్త బోరుబావుల నుంచి నీటి కనెక్షన్‌లు ఇస్తున్నామన్నారు. మాజీ కార్పొరేటర్‌లు చిక్కతిమ్మయ్య, ఎంపి స్వామి, సిరా కృష్ణప్ప, గిరీశ్, స్థానిక కాంగ్రెస్ ప్రముఖులు ఉమేశ్‌చంద్ర, పద్మమహాలింగ, నంజప్ప, సోమశేఖర్, నింగేగౌడ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్ప

మధ్యాహ్న భోజనంలో మార్పులు

- పరిగణనలోకి ఎస్ఎంసీ సూచనలు
- ఏజెన్సీలకు బకాయిలు చెల్లించేలా ఏర్పాట్లు

ధర్మవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం మెనూలో మార్పులు తీసుకురానున్నట్లు సమాచారం. ఇవి సంక్రాంతి తరువాత అమలుల్లోకి రానున్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా భారీ మార్పులు చేయబోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పథకాన్ని అస్తవ్యస్తంగా కొనసాగించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల సూచనలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుని మెనూలో మార్పులకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలు 2097 ఉండగా.. ఇందులో 1వతరగతి నుంచి 10వతరగతి వరకు చదివే విద్యార్థులు 2లక్షల 47వేల మంది ఉన్నారు. ఇందులో 20 నుంచి 35 శాతం వరకు విద్యార్థులు వివిధ కారణాలతో మధ్యాహ్న భోజనం చేయడంలేదని తెలుస్తోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. అనేక సార్లు గత ప్రభుత్వం దృష్టికి విద్యాశాఖ నివేదికల రూపంలో అందించినా ఫలితం లేకుండాపోయింది.

మెనూలో మార్పులు ఇలా..

- ప్రభుత్వ జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే బడ్జెట్ ముందుగా పెంచాలి. భోజనం కోసం ఫోర్టిఫైడ్ అంటూ లావుగా ఉన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. వాటి స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలన్న పాఠశాలల విజ్ఞప్తులను పరిశీలిస్తున్నారు.
- రోజువారీ మెనూలో అందించే చింతపండు పులిహోర బదులు లెమన్ రైస్ అడుగుతున్నారు. ఉదయం ఇచ్చే రాగిజావాలో నాణ్యత ఉండటం లేదు, దానికి ప్రత్యామ్నాయంగా రాగితో చేసిన చిక్కీలు, లడ్డూలు ఇవ్వాలని లేదా పాలు ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది.
- విద్యార్థుల రోజువారీ మెనూలో ఒక రోజు ఇచ్చే పొంగలిని సరిగా తినడంలేదు. దీనిలో కూడా మార్పులు చేయాలి.
- అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసే మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వడంలేదు. ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి కోడిగుడ్లు కూడా సరఫరా చేయాలని భావిస్తున్నారు.
- ప్రతి శనివారం అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే మధ్యాహ్న భోజన పథకంలో స్వీట్‌ను పిల్లలు సరిగా తినటంలేదు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆలోచిస్తున్నారు.
- వంట ఏజెన్సీలకు బకాయిలు సకాలంలో చెల్లించడంలేదు. అప్పులు చేయాల్సి వస్తోందని, ఏ నెలకు ఆ నెల సకాలంలో బిల్లులు ఇస్తే అప్పులు బాధ తప్పుతుందని విజ్ఞప్తులు ఉన్నాయి. వంటచేసే ఏజెన్సీలకు చెల్లించే చార్జీలు పెంచేలా ప్రభుత్వానికి నివేదించాలని పాఠశాలలు చేసిన విజ్ఞప్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నారు. ఆయా మార్పులతో సంక్రాంతి తరువాత నూతన మెనూ అమలు చేస్తారని తెలుస్తోంది.



మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

బాధ్యతగా వ్యవహరించాలి



పాఠశాల వార్షికోత్సవంలో బహుమతుల ప్రదానం


శిడ్లఘట్ట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, చదివించాల్సిన తల్లిదండ్రులు తమ బాధ్యతను విస్మరిస్తే పిల్లల ఉజ్వల భవిష్యత్తు సాధ్యం కాదని బీఈఓ నరేంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని సరస్వతి విద్యాసంస్థలో ఏర్పాటైన 48వ వార్షికోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేలా చూడ్డంతోపాటు తరచుగా వారి విద్యా ప్రగతి పట్ల తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. ప్రత్యేకించి ప్రతి విద్యార్థికి ఎస్ఎస్ఎల్‌సీ కీలకమన్నారు. చక్కటి ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ ఎంతో శ్రమిస్తోందన్నారు. సరస్వతి విద్యాసంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ తమవంతుగా గుణాత్మక విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం పాటు పడుతున్నారన్నారు. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించామని ఈసారి కూడా సాధిస్తామన్న విశ్వాసం ఉందన్నారు. ఇదే సందర్భంగా చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై వేణుగోపాల్, అక్షరదాసోహ సహాయక డైరెక్టర్ అంజనేయ, సరస్వతి విద్యాసంస్థ కార్యదర్శి నాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు రఘు, వెంకటరెడ్డి, రుక్మిణి, అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల ఉధృతి

శెట్బూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పంటలకు సోకుతున్న తెగుళ్ల అన్నదాతకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో వందల ఎకరాల్లో రైతులు వేరుశనగ, మొక్కజొన్న, టమోటా తదితర పంటలు సాగు చేశారు. అయితే ఈ ఏడాది భారీగా పొగ మంచు ఉండటంతో పంటలకు చీడపీడల ఉధృతి బాగా పెరిగింది. తెగుళ్ల నివారణకు పదేపదే ఎన్ని పురుగు మందులు పిచికారీ చేసినా ఉపయోగం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలతో సతమతమవు తున్న అన్నదాతకు సలహాలు ఇచ్చే వ్యవసాయాధికారులు కరువయ్యారు. దీంతో ఎరువులు దుకాణాల వద్దకు వెళ్లి వారికి తెగులు సోకిన పంటను చూపించి, ఇచ్చిన మందులు తెచ్చుకుని పిచికారీ చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి సకాలంలో అన్నదాతలకు సలహాలు, సూచనలు ఇచ్చేలా వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

చిరుత దాడిలో రెండు ఆవుదూడల మృతి

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్నేపల్లి రోడ్డు సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలో శనివారం అర్ధరాత్రి ఆవు దూడలపై ఓ చిరుత దాడి చేసినట్లు రైతు రాజన్న తెలిపారు. దీంతో రెండు దూడలు మృతి చెందాయన్నారు. తరచుగా పంట పొలాల్లో చిరుతలు సంచరిస్తూ దూడలు, మేకలపై దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖాధికారులు స్పందించి చిరుతలను బంధించాలని కోరారు. సంఘటనా స్థలాన్ని అటవీశాఖాధికారులు పరిశీలించారు. రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.18	1,591.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,122	262
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,961	1,470
నీటి నిల్వ (టీఎంసీలు)	91.01	11.77

నేడు కల్యాణోత్సవం



అలంకరణలో శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి

బళ్లారి సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి కల్యాణ మహోత్సవం ప్రచార యాత్ర సోమవారం నిర్వహిస్తున్నట్లు సంగమేశ్వర ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం బసవేశ్వర నగర్ సంగమేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమై కే.ఈ.బీ, సర్కిల్ మోకా రోడ్డు, దుర్గమ్మ దేవస్థానం నుంచి పార్వతీనగర్‌లోని బసవ భవన్ వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు బసవ భవన్‌లో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

8న అనంతలో కరువు బృందం పర్యటన

అనంతపురం అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంటనష్టంపై అధ్యయం కోసం కేంద్ర కరువు బృందం ఈనెల 8న జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు జిల్లాలో పర్యటన షెడ్యూల్‌ను ఆదివారం ఖరారు చేశారు. ఈనెల 8న మధ్యాహ్నం 2 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు అనంతపురం రూరల్ మండలం మన్నీలకు కరువు బృందం సభ్యులు చేరుకుంటారు. ఆ గ్రామంలో గతేడాది ఖరీఫ్‌లో సాగు చేసిన ఆముదం పంటను పరిశీలించి, స్థానిక రైతులతో మాట్లాడతారు.

అన్న దాడిలో తమ్ముడి మృతి

● భూవివాదాలే కారణం



నిందితుడు శ్రీరామ్

హోసూరు(క్రైం) జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బట్టవరపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ముల మధ్య భూవివాదాలు ఉన్నాయి. తమ్ముడు మునీంద్ర (38)పై కూలి పని చేసే అన్న శ్రీరామ్‌ను మద్యంమత్తులో దాడి చేయగా మృత్యువాత చెందడంతో చివరకు జైలుపాలయ్యాడు. కార్పెంటర్ పనిచేసే మునీంద్రకు భార్య శాంత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విభేదాల కారణంగా దంపతులు విడిపోయారు. మునీంద్ర అన్న శ్రీరామ్ (40) కూలి పనిచేసేవాడు. అతడికి భార్య శైల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యం సేవించే అలవాటు ఉన్న శ్రీరామ్ నుంచి శైల విడిపోయింది. అన్నదమ్ములు శనివారం రాత్రి అతిగా మద్యం తాగి, వాగ్వాదానికి దిగారు. ఆగ్రహించిన శ్రీరామ్ కర్రతో మునీంద్రపై తీవ్రంగా దాడి చేశాడు. అనంతరం అతడు మద్యం మత్తులో ఇంట్లోకి వెళ్లాడు, అదేవిధంగా శ్రీరామ్ కూడా తన ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఉదయం ఎంతసేపటికి మునీంద్ర ఇంటి నుంచి బయటకు రాలేదు. ఎలాంటి స్పందన లేకపోవడంతో కుటుంబీకులు బాగలూరు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఇంటికి వెళ్లి చూడగా మునీంద్ర మృతి చెందినట్టు నిర్ధారించారు. కర్రతో కొట్టి చంపిన నేరానికి అతని సోదరుడు శ్రీరామ్‌ను అరెస్టు చేశారు. దర్యాప్తులో శ్రీరామ్ తండి చిక్కన్నకు 50 సెంట్లు భూమి, ఇల్లు ఉంది. సదరు భూమిలో శ్రీరామ్‌కు 20 సెంట్లు, మునీంద్రకు 20 సెంట్లు భూమి పంపిణీ చేశారు. మిగిలిన 10 సెంట్లు భూమి, ఇంటిని భార్య ఇమలమ్మకు ఇచ్చారు. మునీంద్ర మద్యం సేవించి 10 సెంట్ల భూమిని కూడా రాసివ్వాలంటూ నిత్యం ఇబ్బంది పెట్టేవాడని తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన శ్రీరామ్ మద్యం మత్తులో తమ్ముడు మునీంద్రను రోలింగ్ కర్రతో కొట్టగా మృతి చెందాడు. స్థానికంగా ఈ ఘటన సంచలనం సృష్టించింది.

ఇలపై హరివిల్లు

బళ్లారిలోని శ్రీ నంద రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నిర్వాహకులు కన్సొలేషన్ బహుమతులు అందించారు.

- ఆంధ్రజ్యోతి, బళ్లారి



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు



న్యాయ నిర్ణేతలకు సన్మానం



ముగ్గులను పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి



ఆంధ్రజ్యోతి సిబ్బందిని సన్మానిస్తున్న నిర్వాహకులు



కన్సొలేషన్ బహుమతి అందుకుంటున్న బాలిక



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



మహిళలకు సూచనలిస్తున్న జీఆర్ వెంకటేసులు



గంధాన్ని ఊరేగిస్తున్న భక్తులు



హజరత్ బడేసాబ్ దర్గా

వైభవంగా బడేసాబ్ ఉరుసు

రాయచూరు జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని యరగేరలో వారం రోజుల పాటు జరిగే హజరత్ బడేసాబ్ 126వ ఉరుసు వైభవంగా జరిగింది. శనివారం రాత్రి గంధోత్సవం నిర్వహించగా, ఆదివారం ఉరుసు కొనసాగింది. సయ్యద్ హఫీజుల్లా ఖాద్రి సజ్జాదే ఇంటి నుంచి ప్రారంభమైన గంధం ఊరేగింపులో బడేసాబ్ దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహ్మద్ నిజాముద్దీన్, కార్యదర్శి ఫరూక్, గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఫకృద్దీన్, గ్రామ పెద్ద ఎం.కృష్ణజి, మహాదేవ నాయక్, హాజీ మలంగ్ సాదిక్‌ఖాన్ యరగేరా, నాగరాజ్ నాయక్, వెంకటేశ్, రాము పాల్గొన్నారు. ఉరుసు ఉత్సవాలు వారం రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. యరగేరా సీఐ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు పర్యవేక్షించారు.

మహిళలను గౌరవించండి



వాల్మీకి సర్కిల్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బళ్లారి సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సృష్టికి ప్రతీకగా నిలిచిన మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని హంబావిలోని పాఠశాల నుంచి శనివారం పాఠశాల సీఈఓ సునీల్ కుమార్, జిల్లాపోలీసుశాఖ, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, సిబ్బంది ర్యాలీని ప్రారంభించారు. మాజీ మంత్రులు బి.శ్రీరాములు, జనార్దన రెడ్డి నివాసం ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించారు. పాఠశాలలు, కళాశాలలు, కుటుంబాల్లో ఆడపిల్లలకు రక్షణ, భద్రత కల్పించేందుకు పౌర సమాజం ముందుకు రావాలని విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుతూ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం కింద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలపై వక్ర బుద్ధి చూపకుండా ప్రజా ఉద్యమం చేపట్టాలని సందేశం ఇచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లాపోలీస్ శాఖ అధికారులు నృత్య ప్రదర్శన ద్వారా బాలికలను రక్షించడంపై అవగాహన కల్పించించారు. బాలికలకు గులాబీ పువ్వులు ఇచ్చి ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యాజమాన్యం, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

బళ్లారి సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయంగా ఖనిజ తవ్వకాల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తక్షణం పరిహారం చెల్లించాలని భగత్‌సింగ్ యువసేన నాయకులు ఆదివారం ధర్నా చేపట్టారు. సండూరులోని బాబయ్య క్రాస్ వద్ద నిరసన చేపట్టారు. సేన అధ్యక్షుడు జటంగి బసవరాజ్ మాట్లాడుతూ తాలూకాలో అక్రమమైనింగ్ నిరంతరం కొనసాగుతోందన్నారు. గనుల నుంచి రాకపోకలు సాగించే లారీల ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతిచెందిన వారి కుటుంబాలకు తక్షణం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే భారీ వాహనాల రాకపోకలకు మరో రహదారిని నిర్మించాలన్నారు. దీనిపై ఎంపీ తుకారం ధర్నా ప్రాంతానికి చేరుకుని అధికారుల నేతృత్వంలో సమావేశం నిర్వహించి సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మహేశ్‌గౌడ, సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, సభ్యులు అంబరీష్, తిమ్మప్ప, మురళీకృష్ణ, రాఘవేంద్ర, శరణ్, బసవరాజ్, మమేశ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న భగత్‌సింగ్ యువసేన నాయకులు

పోలీసుల వేషంలో గొలుసు చోరీ..!



యరగేర పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రాయచూరు జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని నల్లగుండ క్రాస్ వద్ద ఆదివారం ఇద్దరు అపరిచిత వ్యక్తులు పోలీసుల వేషంలో వచ్చి బైక్‌పై వెళుతున్న దంపతుల వద్ద నగలు అపహరించారు. నగరానికి చెందిన మడ్డిపేట నివాసి మల్లేశ్ ఆయన భార్య సరోజమ్మ యరగేరా బడేసాబ్ ఉరుసుకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బైక్‌పై వస్తున్న దంపతులను ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఆపి తాము పోలీసులమని రాత్రి ఈ ప్రదేశంలో దొంగతనం జరిగిందని వారి వద్ద ఉన్న బంగారు గొలుసును తీసి పరిశీలించే నెపంతో కాగితంలో కట్టుకుని అది తమవద్దే ఉంచుకుని వారికి నకిలీ గొలుసును అంటగట్టి అక్కడ నుంచి పరారయ్యారు. మోసపోయినట్లు గుర్తించిన దంపతులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎలాంటి స్పందన లేదని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న యరగేరా పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక అపహరణ.. అత్యాచారం

రాయచూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం జరిపిన ఘటనలో ఆలస్యంగా వెలుగు చూసింది. మస్కి తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే ఊరికి చెందిన నలుగురు దుండగులు కారులో తీసుకెళ్లి రెండు రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి అత్యాచారం చేసినట్లు తెలిసింది. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి నలుగురు యువకులు నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేశారు. వారిలో ఒకరిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే అత్యాచారం, దౌర్జాన్యాలకు సంబంధించిన కేసులున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్తీ కల్లు రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



కల్తీ కల్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రాయచూరు జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై కల్తీ కల్లును రవాణా చేసి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని మైలార్ నగర్‌కు చెందిన మహేశ్ కుమార్ కల్తీ కల్లు రవాణా చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. మహేశ్ గతకొంత కాలంగా కల్తీ కల్లు వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా జరిపిన దాడిలో అతని వద్ద నుంచి 80 లీటర్ల కల్తీ కల్లుతో పట్టుబడ్డాడు. బైకును స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారి కవితా తెలిపారు.

హోసూరు జోన్

డీఎంకే గెలుపు లక్ష్యం: మంత్రి చక్రపాణి

హోసూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రానున్న 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణగిరి జిల్లాలోని మొత్తం 6 నియోజకవర్గాల్లో డీఎంకే విజయం సాధించాలని తమిళనాడు పౌర ఆహార సరఫరాల శాఖ మంత్రి చక్రపాణి పిలుపునిచ్చారు. హోసూరులోని ఓ ప్రైవేట్ కళ్యాణమంటపంలో పార్టీ ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా డీఎంకే కార్యదర్శి ఎమ్మెల్యే వై.ప్రకాశ్ అధ్యక్షత వహించారు. హోసూరు మేయర్ ఎస్.ఏ. సత్య, వేపనపల్లి మాజీ ఎమ్మెల్యే మురుగన్ నాయకత్వం వహించారు. ఆంగ్ల సంవత్సరాది, సంక్రాంతి నేపథ్యంలో పార్టీ ఏజెంట్లకు చేతి గడియారాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఇటీవల చెన్నైలో జరిగిన పార్టీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల సమావేశంలో 200కుపైగా స్థానాల్లో విజయం సాధించాలని సీఎం స్టాలిన్ సూచించారన్నారు. 2026 ఎన్నికలు చాలా ముఖ్యమైనవన్నారు. ఇప్పటినుంచే పార్టీ కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. డీఎంకే అధ్యక్షుడిగా స్టాలిన్ పగ్గాలు చేపట్టాక అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తూ వస్తున్నామని అదేవిధంగా 2026 ఎన్నికల్లో కూడా 200కు పైగా నియోజకవర్గాల్లో డీఎంకే విజయం సాధించే లక్ష్యానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. హోసూరు కార్పొరేషన్ కు అనేక పంచాయతీలు అనుబంధంగా ఉన్నాయని బాగలూరు, శూలగిరి, రాయకోట, పంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ చైర్మెన్ యువరాజు, జిల్లా కోశాధికారి సుకుమారన్, ముఖ్య కార్యవర్గ సభ్యుడు ఎల్లోరమణి, ఆనందయ్య, రాము, తిమ్మరాజు, వెంకటేశ్, పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, టాక్స్ కమిటీ చైర్మెన్ చిన్నీరప్ప, మున్సిపల్ కౌన్సిల్ చైర్మెన్ సెందిల్‌కుమార్, జిల్లా మున్సిపల్ టీమ్‌లు నిర్వాహకులు, 1008 మంది పార్టీ ఏజెంట్లు పాల్గొన్నారు.



కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి చక్రపాణి



ముత్యాల ముగ్గుల పోటీలకు హాజరైన జ్యోతి బాలకృష్ణారెడ్డికి షీల్డు అందజేత



మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి



బాగలూరు వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి



షీల్డు అందుకుంటున్న అతిథి





ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గులు



సర్పంచ్ జయకుమార్‌రెడ్డి



ప్రసంగిస్తున్నకౌన్సిలర్ రవికుమార్



ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల విజేతలతో బృందం



న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన మహిళలు



కోలాటం ఆడుతున్న కళాకారిణులు